RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

WEB : WWW.rajadhanivoice.com rajadhanivoicedaily@gmail.com




సంపుటి : 02 | సంచిక : 268 | 20 గురువారం ఆగష్టు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు

- నారా లోకేశ్ కీలక ప్రకటన
- 37 కళాశాలలకు కొత్త భవనాలు
- 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు
- విద్యా మౌలిక వసతులపై దృష్టి



**రాజధాని వాయిస్ అమరావతి :** రాష్ట్రంలోని విద్యార్థుల కు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభలో వెల్లడించారు. సొంత భవనాలు లేని 37 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు ప్రకటించారు. అలాగే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఆధునిక సదుపాయాలతో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేయడానికి సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. విద్యా రంగంలో నాణ్యత పెంపుతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యపై ప్రత్యేకంగా స్పందించారు. ప్రస్తుతం ఆ కళాశాలలో 103 మంది విద్యార్థులు చదువుతున్నారని, కొత్త భవన నిర్మాణానికి అవసరమైన భూమి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రత్యేక పథకం కింద కొత్త కళాశాల భవనంతో పాటు దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణాన్ని కూడా చేపడతామని హామీ ఇచ్చారు. ▶▶2

## కుటుంబం గురించే ఎక్కువ చెప్పా కానీ..: ఆత్మకథపై సోనియా గాంధీ



దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ .. తన వ్యక్తిగత జీవితం గురించి తొలిసారి మనసు విప్పనున్నారు. 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరిట తన ఆత్మకథను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అది నవంబర్ 10న ప్రచురితం కానుంది. ఈ నేపథ్యంలో సోనియా మాటలను ప్రచురణకర్త ఆల్‌ఫ్రెడ్ గుర్తుచేసుకున్నారు.సోనియా అనూహ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటివరకు ప్రజాజీవితానికి దూరంగా ఉన్న తనను.. హృదయవిదారక ఘటనలు, నష్టాలు రాజకీయాల వైపు లాగాయని సోనియా గుర్తుచేసుకున్నారు. ఈ ఆత్మకథ రాయడం తనకు సులభంగా ఏమీ జరగలేదని చెప్పారు. తన మనసులోతుల్లో దాచుకున్న అనుభవాలను బయటపెట్టడం అంత సులువు కాలేదన్నారు. తన ప్రయాణంలోని ఆనందాలు, నిరాశల సమాహారమే ఈ పుస్తకం అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవిత భాగస్వామిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగానే సోనియాగాంధీ అందరికీ సుపరిచితురాలు. రాజీవ్‌తో ప్రేమ, పెళ్లి, భారత్‌కు రావడం, ఇలా తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలను ఈ పుస్తకం రూపంలో సోనియా వెల్లడించనున్నారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత భర్త రాజీవ్‌గాంధీ హత్య తన జీవితాన్ని ఎలా మార్చాయో పుస్తకంలో ప్రస్తావించారు.

## వెలిగొండ నిర్వాసితులకు పరిహార చెక్కులు

- ముఖ్యమంత్రి చేతులమీదుగా రెండో విడత పంపిణీ
- 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లు
- పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 19 :** వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు రెండో విడత పరిహార చెక్కులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం అందజేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించి వారికి న్యాయం చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభోత్సవానికి గడువు సమీపిస్తున్న నేపథ్యంలో నిర్వాసితుల పునరావాసం, పరిహారం అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం రైతులు, బాధిత కుటుంబాలు చేసిన త్యాగాలు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. ▶▶2

## వర్ల రామయ్యకు లోకేష్ శుభాకాంక్షలు

**అమరావతి, ఆగస్టు 19 :** గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వర్ల రామయ్యకు విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్‌లో వర్ల రామయ్య మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ రాష్ట్ర రాజకీయాలు, పార్టీ కార్యక్రమాలు, శాసనమండలి బాధ్యతలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న వర్ల రామయ్యకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి దక్కడం పార్టీ కార్యకర్తల్లో ఆనందాన్ని కలిగించింది. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శాసనమండలిలో ఆయన సేవలు మరింత ఉపయోగపడతాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అసెంబ్లీలో జరిగిన ఈ భేటీలో మంత్రి లోకేష్, వర్ల రామయ్యకు అభినందనలు తెలియజేస్తూ శాసనమండలిలో ప్రజల సమస్యలను ▶▶2



## గ్రూప్-1 పరీక్షల్లో .. భారీ అక్రమాలు

- సీఎం చంద్రబాబు

**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 19 :** అమరావతి: వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకున్నారని.. పేపర్లను పూర్తిగా అనర్హులతో దిద్దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అక్రమాలపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. **ఇష్టానుసారం వ్యవహరించారు..** "గ్రూప్-1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నా యి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారు? మార్కులు తగ్గించడం.. పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. ▶▶2



## రాయలసీమకు తాగునీటి భద్రతే లక్ష్యం

- జూలై 2027 వరకు నీటి కొరత లేకుండా చర్యలు
- తాగునీరు, చెరువుల నింపుదలకే ప్రాధాన్యం
- తుంగభద్ర జలాల వినియోగంపై సమీక్ష
- ఎల్‌నినో పరిస్థితుల్లో సమర్థ నీటి నిర్వహణకు ఆదేశాలు



రాజధాని వాయిస్ :అమరావతి, ఆగస్టు 19 : రాయలసీమ ప్రాంతంలో జూలై 2027 వరకు తాగునీటి కొరత తలెత్తకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత, రాయలసీమకు నీటి కేటాయింపులపై తన క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. అందుబాటులో ఉన్న పరిమిత నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలు తీర్చడానికి, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులను నింపడానికి మాత్రమే వినియోగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజల తాగునీటి అవసరాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రాయలసీమ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రాయలసీమకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, తుంగభద్ర డ్యామ్ ఇంజనీర్లు, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇంజనీర్-ఇన్-చీఫ్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. ▶▶2

## ఎన్నికలకు సిద్ధంకండి..

- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



**రాజధాని వాయిస్ తాడేపల్లి, :**కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## నీట్ సంస్కరణలపై సుప్రీం దృష్టి

- ఎన్‌టీఏకు పూర్తి వివరాల సమర్పణ ఆదేశం
- వ్యవస్థాగత మార్పులు శాశ్వతంగా అమలు కావాలన్న ధర్మాసనం
- ప్రశ్నపత్రాల భద్రతపై కేంద్రం వివరణ
- పేపర్ లీక్‌ల పునరావృతంపై ఆందోళన

రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 19 : నీట్ పరీక్షల నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. పరీక్షల విధానంలో సంస్కరణలు కేవలం నివేదికలు, సిఫార్సులకే పరిమితం కాకుండా శాశ్వత వ్యవస్థగా అమలు కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. రాధాకృష్ణన్ కమిటీ, నందన్ నీలేకని కమిటీలు సూచించిన సంస్కరణల అమలుపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల పూర్తి వివరాలను సమర్పించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను ఆదేశించింది. నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ తరపున దాఖలైన పిటిషన్‌ను కూడా కోర్టు పరిశీలించింది. పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగత మార్పులు అవసరమని, ఒకసారి సంస్కరణలు ప్రకటించడం సరిపోదని, వాటి అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ధర్మాసనం పేర్కొంది.విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. నీట్ ప్రశ్నపత్రం తయారీ నుంచి విద్యార్థుల చేతికి చేరే వరకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ అమల్లో ఉందని ఆయన కోర్టుకు వివరించారు. ప్రశ్నపత్రం రూపకల్పనలో అనేక స్థాయిల్లో గోప్యత ▶▶2

# వర్ల రామయ్యకు లోకేష్ శుభాకాంక్షలు



సమర్ధవంతంగా ప్రస్తావించాలని ఆకాంక్షించినట్లు సమాచారం. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మండలిలో చురుకైన పాత్ర పోషించాలని సూచించినట్లు తెలిసింది. పార్టీ బలోపేతానికి కూడా ఆయన అనుభవం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు మంత్రి లోకేష్‌కు వర్ల రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ లక్ష్యాల సాధనకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. శాసనమండలిలో ప్రజా సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నానని వర్ల రామయ్య వెల్లడించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో నిర్మాణాత్మక సూచనలు చేస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారని చెప్పారు. అనుభవజ్ఞుడైన నాయకుడిగా మండలిలో ఆయన పాత్ర కీలకంగా ఉండనుందని అభిప్రాయపడుతున్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం వర్ల రామయ్య రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధతకు ఇది గుర్తింపుగా నిలిచిందని కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాసనమండలిలో విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన బోధనా, బోధనేతర సిబ్బందిని దశలవారీగా నియమిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని లోకేశ్ వివరించారు. ఒక్కో కళాశాల పూర్తి స్థాయిలో నిర్మించడానికి సుమారు రూ.15 కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. ల్యాబొరేటరీలు, కంప్యూటర్లు, బెంచీలు వంటి సదుపాయాల కోసం స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక నిధులను వినియోగించుకోవచ్చని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. గ్రంథాలయ వ్యవస్థ బలోపేతంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాలకు చెందాల్సిన సెస్సు నిధులు ఇతర అవసరాలకు మళ్లించబడ్డాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధులను తిరిగి గ్రంథాలయ శాఖకు అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కడపలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ పనులను వచ్చే తొమ్మిది నెలల్లో పూర్తి చేసే బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంగళగిరిలో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీ విజయవంతంగా పనిచేస్తోందని లోకేశ్ వెల్లడించారు. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు అక్కడ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని చెప్పారు. ఈ నమూనాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పూర్వ విద్యార్థులు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సహకరిస్తే గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయవచ్చని పిలుపునిచ్చారు. అమరావతిలో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్, తెలుగు సాంస్కృతిక కేంద్రంతో అనుసంధానంగా దేశంలోనే అత్యుత్తమ కేంద్ర గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. త్వరలోనే నమూనా రూపకల్పన పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కేంద్రంగా ఒక ప్రాంతీయ గ్రంథాలయం, రాయలసీమ ప్రాంతానికి మరో అత్యాధునిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పుస్తక పఠనం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే కాకుండా డిజిటల్ వ్యసనాల నుంచి దూరం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నారా లోకేశ్ పేర్కొన్నారు.

# వెలిగొండ నిర్వాసితులకు పరిహార చెక్కులు

వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని కార్యక్రమాలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాలకు ఒకేసారి పరిష్కార పద్ధతి కింద ఇప్పటికే 2,557 కుటుంబాలకు రూ.318 కోట్ల పరిహారం చెల్లించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రెండో విడతలో మరో 1,600 కుటుంబాలకు రూ.200 కోట్ల పరిహారానికి సంబంధించిన చెక్కులను ముఖ్యమంత్రి అందజేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 4,157 కుటుంబాలకు రూ.518 కోట్ల పరిహారం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాసం కోసం ప్రభుత్వం ప్రత్యేక కాలనీలను అభివృద్ధి చేస్తోంది. మొత్తం ఏడు పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. వీటిలో వేములకోట మినహా మిగిలిన ఆరు కాలనీల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. మౌలిక వసతులు పూర్తికావడంతో నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలివెళ్తున్నాయి. తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుధ్య సదుపాయాలు వంటి అన్ని అవసరాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు రాష్ట్ర సాగునీటి రంగంలో కీలక మైలురాయిగా నిలవనుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు కారణంగా ప్రభావితమైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన తెలిపారు.

# రాయలసీమకు తాగునీటి భద్రతే లక్ష్యం

లో-లెవల్ కెనాల్, హై-లెవల్ కెనాల్‌లకు నీటి కేటాయింపులు, వినియోగ విధానాలు, భవిష్యత్ అవసరాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. నీటి పంపిణీలో ఎలాంటి ప్రాంతీయ అసమానతలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌లోకి కేవలం 105 టీఎంసీల నీరు మాత్రమే వచ్చే అవకాశం ఉందని అధికారులు సమావేశంలో వెల్లడించారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు 32.9 టీఎంసీల వాటా లభిస్తుందని వివరించారు. రాష్ట్ర వాటాలో హై-లెవల్ కెనాల్‌కు 11.88 టీఎంసీలు, లో-లెవల్ కెనాల్‌కు 16.09 టీఎంసీలు, కే-సీ కెనాల్‌కు 4.95 టీఎంసీల నీటిని కేటాయించే ప్రణాళికను వివరించారు. ఈ పరిమిత నీటిని అత్యంత జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. జూలై 2027 వరకు రాయలసీమలో తాగునీటి కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు నిమ్మల రామానాయుడు తెలిపారు. నీటి లభ్యత తగ్గినా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ అవసరమైన నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా నీటి వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశముందని, అందువల్ల శాస్త్రీయ పద్ధతుల్లో నీటి నిర్వహణ చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూనే చెరువుల నింపుదల, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ రాయలసీమ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు

# ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు: నారాయణ



**అమరావతి, ఆగస్టు19:** ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు ఉంటాయని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎన్నికల్లో నేరు ఎంపికైన వారికి బలమైన ప్రజామోదం ఉంటుం దని అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం మేయర్, మున్సిపల్ చైర్మన్‌పై ఉండదని స్పష్టం చేశారు. వీరిద్దరు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే సుదీర్ఘ అభివృద్ధి ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉంటుందని అన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చునని చెప్పారు. పెట్టుబడిదారులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని మేయర్, చైర్మన్ యాక్టివ్‌గా ప్రమోట్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వీరిద్దరిపై రాజకీయ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకూ అవసరమైన పనులు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. అంతకుముందు అసెంబ్లీలో పురపాలక శాసనాల 4వ సవరణ బిల్లును మున్సిపల్ పరపాలన శాఖ మంత్రి నారాయణ ప్రవేశపె ట్టారు. దీనికి సంబంధించిన చట్ట సవరణ చేస్తూ ప్రవేశపె ట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపిక ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరగనుంది. ఇప్పటి వరకూ వీరిద్దరిని పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటున్న సంగతి తెలిసిందే.

# అరుణాచల్‌లో చైనా ఆక్రమణ వార్తలు.. ఖండించిన కిరణ్ రిజిజు



చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లోని లాంగ్జు సమీపంలో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని ప్రచారం అవుతున్న కథనాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజుతోసిపుచ్చారు. భూభాగాన్ని ఎవరూ ఆక్రమించుకోలేదని.. సరిహద్దు వెంబడి భారత సైన్యం, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు గస్తీని గణనీయంగా పెంచారని పేర్కొన్నారు. 'లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్' సమీపంలో చైనా నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతం 1959లోనే ఆ దేశం ఆక్రమించుకున్న భూభాగంలో ఉందని స్పష్టం చేశారు. చైనా దళాలు మన గ్రామాలను ఆక్రమించుకొని, శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఎల్ఏసీ సంబంధించి స్పష్టమైన సరిహద్దు గుర్తింపు లేకపోవడం వల్ల లాంగ్జు ప్రాంతం చాలా కాలంగా వివాదాస్పదంగా ఉందని రిజిజు పేర్కొన్నారు. ఆ సరిహద్దు పాయింట్ వద్ద మన పోస్ట్ కూడా ఉందన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయడం వల్ల అక్కడ మోహరించిన మన సైనిక సిబ్బంది, భద్రతా దళాల మనోధైర్యం దెబ్బతింటుందన్నారు. 1962 భారత్-చైనా యుద్ధం తర్వాత ఆ ప్రాంతంలో ఇరుదేశాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. అయితే అక్కడి పర్వత శ్రేణుల వెంబడి చైనా సైనిక కార్యకలాపాలు పెరిగాయని ధ్రువీకరించారు.

# టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై అరెస్టు వారెంట్ జారీ



తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా పై అరెస్టు వారెంట్ జారీ అయ్యింది. విద్వేష ప్రసంగం కేసులో సమన్లను ధిక్కరించినందుకుగానూ పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ కోర్టు ఈమేరకు చర్యలు తీసుకుంది. ఈ అరెస్టు వారెంట్ అమలుకు సంబంధించిన నివేదికను ఆగస్టు 28న తమకు సమర్పించాలని పోలీసుల ను ఆదేశించింది. మహిళలను అవమానించారని, విద్వేషపూరిత ప్రసంగం చేశారనే ఆరోపణలపై మహువా మొయిత్రాపై గతంలో కేసు నమోదైంది. దీనికి సంబంధించి కృష్ణానగర్ కోర్టు ఆమెకు పలుమార్లు సమన్లు జారీ చేసింది. బుధవారం కోర్టుకు హాజరు కావాలని ఇటీవల మరోసారి ఆదేశించింది. అయినప్పటికీ.. ఆమె హాజరు కాలేదు. పదేపదే సమన్లు జారీ చేసినప్పటికీ.. ఆమె గైర్హాజరు కావడాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం ఆమెపై అరెస్టు వారెంట్ జారీ చేసింది. "కోర్టు ఆదేశాలను పదేపదే ధిక్కరించడం.. ఆమె నిర్లక్ష్య వైఖరిని సూచిస్తోంది. దీంతో అరెస్టు వారెంట్ జారీ చేయడం తప్ప కోర్టుకు వేరే మార్గం లేకపోయింది. మొయిత్రా కోర్టుకు హాజరవ్వరని ఆమె తరఫు న్యాయవాది చెప్పారు. దీనిని బట్టి ఆమెకు న్యాయస్థానంపై గౌరవం లేదని స్పష్టమవుతోంది" అని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఈదుమూడి బాధిత యాదవులకు జగన్ భరోసా

## తాడేపల్లిలో వైఎస్ఆర్‌సీపీ అధినేతను కలిసిన బాధితులు
## దాడి, కౌంటర్ కేసులపై ఆవేదన వ్యక్తం
## న్యాయపోరాటంలో అండగా ఉంటామని హామీ





**రాజధాని వాయిస్ తాడేపల్లి, ఆగస్టు 19 :** ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామానికి చెందిన యాదవులు బుధవారం తాడేపల్లిలోని వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసి తమపై జరిగిన దాడి ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. తమపై జరిగిన దాడితో పాటు అనంతరం తమపైనే కౌంటర్ కేసులు నమోదు కావడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాధితుల విన్నపాలను ఆలకించిన వైఎస్ జగన్, బాధిత కుటుంబాలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం జరిగే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొట్ల రామారావు మీడియాతో మాట్లాడుతూ, గొర్రెలు మేపుకుంటున్న యాదవులపై జరిగిన దాడి దురదృష్టకరమన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయినప్పటికీ, వారిపైనే కౌంటర్ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని విమర్శించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పార్టీతో పాటు యాదవ సంఘాలు, బీసీ సంఘాలు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆదర్శ గ్రామంగా చెప్పుకునే ఈదుమూడిలోనే యాదవులు, బీసీలపై దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోందని బొట్ల రామారావు అన్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఈ అంశంపై న్యాయ పరంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బాధితుడు అటలమూడి మధుబాబు మాట్లాడుతూ, గొర్రెలు మేపేందుకు వెళ్లిన సమయంలో తమపై దాడి జరిగిందని తెలిపారు. కులం పేరుతో దూషిస్తూ తనను, తన సోదరుడిని కొట్టారని ఆరోపించారు. అనంతరం టీడీపీ కార్యాలయం వద్ద మరోసారి దాడి చేసి బెదిరించారని పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తమపైనే కౌంటర్ కేసులు నమోదు కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబా లకు న్యాయం చేయాలని కోరుతూ వైఎస్ జగన్‌ను కలిసినట్లు మధుబాబు తెలిపారు. తమ సమస్యల ను ఆయనకు వివరించగా పూర్తి సహకారం అందిస్తామని, రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు.

# గ్రూప్-1 పరీక్షల్లో .. భారీ అక్రమాలు



అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు.

**పరీక్ష రాసిన వ్యక్తిని పేపర్లు దిద్దేందుకు..**

తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి.. డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు. ఫ్రీలాన్సర్ మహంకాళి రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ.. 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైంది.

**వైకాపా హయాంలో అతిపెద్ద స్కామ్**

వైకాపా హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి.. పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైకాపా నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదీ" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# నీట్ సంస్కరణలపై సుప్రీం దృష్టి



పాటిస్తున్నామని, ప్రశ్నల ఎంపిక ప్రక్రియను అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రశ్నపత్రాల రవాణాలో కూడా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రశ్నపత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చినట్లు, వాహనం కదలికలన్నీ నిరంతరం పర్యవేక్షణలో ఉంటాయని కోర్టుకు తెలియజేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న భద్రతా వ్యవస్థను ఛేదించడం చాలా కష్టమని కేంద్రం పేర్కొంది. నీట్ పేపర్ లీక్ ఘటనల అనంతరం కేంద్ర విద్యాశాఖ ఏడుగురు సభ్యులతో రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షల నిర్వహణ, డేటా భద్రత, ఎన్‌టీఏ నిర్మాణం, విధి నిర్వహణలో సంస్కరణలపై ఈ కమిటీ పలు కీలక సిఫార్సులు చేసింది. అదే సమయంలో మరింత విస్తృత స్థాయి మార్పుల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో మరో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. విచారణ అనంతరం పిటిషనర్ల తరఫు న్యాయవాది తన్వీ దూబే స్పందిస్తూ, రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులు ఉన్నప్పటికీ గతంలో చోటుచేసుకున్న లోపాలు ఎందుకు పునరావృతమయ్యాయనే అంశంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు నొక్కిచెప్పిందని తెలిపారు.

# ఫొటోగ్రాఫర్ల సేవలు అమూల్యం: చంద్రబాబు

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు
చరిత్రను భద్రపరిచే ఫొటోగ్రాఫర్లు
మీడియా ప్రతినిధులతో సీఎం సమావేశం
ఫొటోగ్రఫీ సమాజానికి అభినందనలు





**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 19 :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్స వం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫొటోగ్రా ఫర్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రను నమోదు చేయడంలో, జ్ఞాపకాలను భద్రపరచడంలో, మానవ జీవిత అనుభవాలను చిత్రాల రూపంలో నిలిపి ఉంచడంలో ఫొటో గ్రాఫర్ల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. సమాజానికి కనిపించని ఎన్నో కథలను వారు తమ కెమెరాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మీడియా, వృత్తిపరమైన ఫొటోగ్రాఫర్లతో సమావేశం కావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఫొటోగ్రాఫర్లు తమ నిబద్ధత, కళాత్మక దృష్టి, నిరంతర శ్రమతో సమాజానికి కొత్త కోణాలను చూపిస్తున్నారని అన్నారు. వారి కృషి వల్లే ఎన్నో సంఘటనలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతున్నాయని పేర్కొన్నా రు. ప్రతి ఫొటో ఒక కాలానికి చెందిన విలువైన క్షణాన్ని భవిష్యత్ తరాలకు అందించే సాక్ష్యంగా నిలుస్తుందని చంద్రబాబు అన్నారు. యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, సామాజిక ఉద్యమాలు, విజయో త్సవాలు వంటి ఎన్నో సందర్భాలను చిత్రీకరించి చరిత్రలో భద్రపరచే బాధ్యత ఫొటోగ్రాఫర్లదేనని చెప్పారు. వారి పని కేవలం చిత్రాలను తీయడం మాత్రమే కాదని, కాలాన్ని నిలుపుకోవడమేనని అభిప్రాయపడ్డారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ఫొటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఒక్క చిత్రం వేల మాటలకు సమానమనే మాట ఫొటోగ్రఫీ విలువను తెలియజేస్తుందని అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడంలో, నిజాలను ప్రతిబింబి ంచడంలో ఫొటోగ్రాఫర్లు ముఖ్యమైన బాధ్యత నిర్వహిస్తున్నారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో ఫొటోగ్రఫీ రంగం మరింత విస్తరించిందని చంద్రబాబు తెలిపారు. కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ ప్రపంచ స్థాయి చిత్రాలను సృష్టిస్తున్న భారతీయ ఫొటోగ్రాఫర్ల ప్రతిభ ప్రశంసనీయమని అన్నారు. యువత ఈ రంగంలో మరింత ముం దుకు రావాలని ఆకాంక్షించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రఫీ రంగానికి చెందిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి శు భాకాంక్షలు తెలిపారు. సమాజానికి స్ఫూర్తినిచ్చే, సమాచారాన్ని అందించే, చరిత్రను నిలిపే చిత్రాలను మరింతగా సృష్టించాలని కోరుతూ ఫొటోగ్రాఫర్ల సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

# చేరికల అడ్డగింతపై భరత్ ఆగ్రహం

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని విమర్శ
త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో అధికారులను నిలదీత
వైఎస్సార్సీపీ కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్
అడ్డుకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిక

**రాజధాని వాయిస్ :రాజమహేంద్రవరం:** 40వ డివిజన్‌లో వైఎస్సార్సీపీ నిర్వహించనున్న భారీ చేరికల కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించడంపై మాజీ ఎంపీ, వైఎస్సార్సీపీ జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్గాని భరత్ రామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన పోలీసు అధికారులను నిలదీశారు. ప్రతిపక్ష పార్టీల రాజకీయ కార్యక్రమాలను శాంతిభద్రతల పేరుతో పదేపదే అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శి ంచారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి తనకు నచ్చిన రాజకీయ పార్టీలో చేరే హక్కు ఉందని భరత్ రామ్ పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి ఇతర పార్టీలకు చెందిన ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రజాస్వామ్యబద్ధమైన కార్యక్రమా లను అడ్డుకోవడం ద్వారా ప్రజల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఉంటే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవచ్చని, అయితే శాంతియుతంగా నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు అనుమతులు నిరాకరించడం సరికాదని స్పష్టం చేశారు. ప్రజల మద్దతుతో నిర్వహించే కార్యక్రమాలను అడ్డుకోవడం వెనుక ఉన్న కారణాలను పోలీసులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మూడు సార్లు వైఎస్సార్సీపీ చేరికల కార్యక్రమాలను అడ్డుకున్నారని భరత్ రామ్ ఆరోపించారు. అయినప్పటికీ ప్రజల ఆదరణతో పార్టీ కార్యక్రమాలు కొనసాగుతాయని, ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ చేరికల కార్యక్రమాన్ని నిలిపివేయబోమని తేల్చిచెప్పారు. ప్రజలతో మమేకమై రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడం తమ హక్కు అని పేర్కొన్నారు.అనుమతి పేరుతో కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలు కొనసాగితే వేలాది మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి 40వ డివిజన్‌లో రోడ్డుపై బైఠాయించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రజల స్వేచ్ఛను హరించే చర్యలను సహించబోమని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృ తం చేస్తామని తెలిపారు. పోలీసులు రాజకీయ పక్షపాతం లేకుండా వ్యవహరించాలని, అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని భరత్ రామ్ డిమాండ్ చేశారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూనే ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజల గొంతుకను వినిపించే అవకాశా న్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు.

# రాష్ట్రపతి సేవా పతకం అందుకున్న అధికారి

లక్ష్మీ నరసింహారావుకు విశిష్ట గౌరవం
43 ఏళ్ల సేవలకు గుర్తింపు
క్లూస్ విభాగంలో విశేష కృషి
జిల్లా పోలీసుల అభినందనలు





**రాజధాని వాయిస్ అనకాపల్లి:** అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సిరికి లక్ష్మీ నరసింహారావు ప్రతిష్టాత్మక రాష్ట్రపతి ఉత్తమ సేవా పతకం--2024ను అందుకున్నారు. అమరావతిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు. పోలీసు శాఖలో ఆయన అందించిన విశిష్ట సేవలు, క్రమశిక్షణ, నిబద్ధతకు గుర్తింపుగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. పోలీసు శాఖలో లక్ష్మీ నరసింహారావుకు 43 ఏళ్ల సుదీర్ఘ సేవా అనుభవం ఉంది. అందులో గత 25 ఏళ్లుగా క్లూస్ విభాగం లో పనిచేస్తూ నేర దర్యాప్తుకు కీలకంగా సహకరించారు. విశాఖ పట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో జరిగిన అనేక కీలక కేసుల విచారణలో ఆయన నైపుణ్యం ప్రదర్శించారు. ఘటనా స్థలాల్లో ఆధారాల సేకరణలో ఆయన చూపిన ప్రతిభకు శాఖలో ప్రత్యేక గుర్తింపు లభించింది.హత్యలు, దొంగతనాలు, దోపిడీలు, అనుమానాస్పద మరణాలు వంటి క్లిష్టమైన కేసుల్లో భౌతిక ఆధారాలను అత్యంత జాగ్రత్తగా సేకరించి దర్యాప్తు అధికారులకు అందించారు. శాస్త్రీయ ఆధారాలపై ఆధారపడి జరిగిన దర్యాప్తుల ద్వారా అనేక కేసుల్లో నిందితులు శిక్షలు పొందేందుకు ఆయన సేవలు దోహదపడ్డాయి. క్లూస్ విభాగంలో ఆయన కృషి నేరాల ఛేదనలో కీలక పాత్ర పోషించింది. సేవా కాలంలో లక్ష్మీ నరసింహా రావు 70 నగదు బహుమతులు, 20 ప్రశంసా పత్రాలు, సేవా పతకం వంటి అనేక పురస్కారాలను అందుకున్నారు. ఇప్పుడు రాష్ట్రపతి ఉత్తమ సేవా పతకం దక్కడం ఆయన సేవా జీవితంలో అత్యున్నత గుర్తింపుగా నిలిచింది. దీర్ఘకాలంగా ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేసిన అధికారిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.రాష్ట్రపతి పతకం అందుకున్న సందర్భంగా అనకా పల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆయనను ప్రత్యేకంగా అభినం దించారు. నేర దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణ అత్యంత కీలకమని, లక్ష్మీ నరసింహారావు అందించిన సేవలు పోలీసు శాఖకు గర్వకారణమని కొనియాడారు. ఆయన కృషికి దక్కిన సరైన గుర్తింపు ఇదేనని పేర్కొన్నారు. లక్ష్మీ నరసింహారావు సాధించిన ఈ ఘనత అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచిం దని అధికారులు తెలిపారు. యువ పోలీసు సిబ్బందికి ఆయన సేవా ప్రస్థానం ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కర్తవ్యనిష్ఠ, నిజాయితీ, వృత్తిపరమైన నైపుణ్యంతో పనిచేస్తే అత్యున్నత గుర్తింపులు సాధించవచ్చని ఆయన విజయం మరోసారి నిరూపించిందని అభిప్రాయపడ్డారు.

# రహదారుల అభివృద్ధిపై సమీక్ష





**రాజధాని వాయిస్ ఉండి :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి, ఉండి ఎమ్మెల్యే కే. రఘురామకృష్ణంరాజు నియోజకవర్గం లోని రహదారుల పరిస్థితిపై బుధవారం సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో రాష్ట్ర రహదారుల శాఖ అధికారులతో సమావేశమైన ఆయన, వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న రహదా రుల అభివృద్ధి పనులు, మరమ్మతులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పై సవివరంగా చర్చించారు. రహదారి మౌలిక వసతుల మెరుగు దలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులు, దెబ్బతిన్న రహదారులు, మరమ్మతులు అవసరమైన ప్రాంతాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రహదారుల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణం, మరమ్మతుల పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించేలా పనులు చేపట్టాలని సూచించారు. పనుల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. పనుల వేగం పెంచడంతో పాటు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించా లని పేర్కొన్నారు.రవాణా వ్యవస్థ బలోపేతం కావడం వల్ల ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని ఆయన అన్నారు. మెరుగైన రహదారులు వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్య సేవల అభివృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రహదారులు అందించడమే లక్ష్యమని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం సమీక్షిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రఘురామకృష్ణంరాజు తెలిపారు. రహదారుల అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

# నేరాల నియంత్రణకు డ్రోన్ నిఘా



**రాజధాని వాయిస్ బాపట్ల, ఆగస్టు 19 :** జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు బాపట్ల పోలీసులు ఆధునిక సాంకేతి కతను వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా క్రైమ్ ప్రోన్ ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా నిర్వహిస్తున్నారు. నేరాలకు అవకాశ మున్న ప్రాంతాలను గుర్తించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతు న్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా అనుమానాస్పద కదలికలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు, ప్రజా శాంతికి భంగం కలిగించే ఘటనలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకునేలా పోలీసులు కార్యాచరణ రూపొందించారు. ముఖ్యంగా జనసం చారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, సున్నిత ప్రాంతాలు, గతంలో నేరాలు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.డ్రోన్ నిఘా వల్ల విస్తారమైన ప్రాంతాలను తక్కువ సమయంలో పరిశీలించే అవకాశం లభిస్తోందని పోలీసులు తెలిపారు. నేరస్థుల కదలికలను గుర్తించడం, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందిం చడం, చట్టసంబంధ చర్యలను మరింత సమర్థవం తంగా అమలు చేయడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు సంప్రదాయ పోలీసింగ్‌తో పాటు సాంకేతిక ఆధారిత పర్యవేక్షణను మరింత విస్తరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు కూడా అనుమానాస్పద అంశాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కాకినాడలో గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం

**- పోర్టు నుంచి జాతీయ రహదారికి నాలుగు వరుసల మార్గం**



**రాజధాని వాయిస్ కాకినాడ:** కాకినాడ పోర్టు దక్షిణ ప్రాంతం నుంచి జాతీయ రహదారి సంఖ్య-216 వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి చర్యలు వేగవంతమవుతున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన భాగస్వామ్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రతిపాదిత రహదారి నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశా లు, భూసేకరణ అవసరాలు, అనుసంధాన మార్గాలు, ట్రాఫిక్ సౌలభ్యం, పర్యావరణ అంశాలు తదితర అంశాలపై అధికారులు చర్చించారు. పోర్టు ప్రాంతం నుంచి జాతీయ రహదారికి నేరుగా అనుసంధానం కల్పించడం ద్వారా రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణంతో పోర్టు ప్రాంతంలో సరుకు రవాణా వేగవంతం కావడంతో పాటు రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని అధికారులు వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక ప్రమాణాలతో రహదారిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనులు వేగంగా ప్రారంభమయ్యేలా అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారుల కు సూచించారు. సమావేశంలో రహదారులు, రెవెన్యూ, పోర్టు, పట్టణాభివృద్ధి తదితర శాఖల అధికారులు పాల్గొని తమ అభిప్రా యాలను వెల్లడించారు. ప్రాజెక్టు అమలుతో కాకినాడ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జూద స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

**రాజధాని వాయిస్ బాపట్ల, ఆగస్టు 19 :** జిల్లాలో అక్రమ జూద కార్యకలాపాలపై బాపట్ల జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జూద స్థావరాలపై విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ జూద కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకునే ప్రక్రియను మరింత వేగవంతం చేశారు.ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే జూదం, ఇతర అక్రమ కార్యకలాపాలపై ఎలాంటి రాజీ ఉండదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. జూద స్థావరాలను నిర్వహించే వారితో పాటు వాటిలో పాల్గొనే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు చట్టాన్ని గౌరవించి వెంటనే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల సహకారంతో జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని బాపట్ల జిల్లా పోలీసులు వెల్లడించారు



## స్థానిక ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన పల్నాడు కలెక్టర్



**నరసరావుపేట.ఆగస్టు 19,రాజధాని వాయిస్:**రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వివిధ అంశాలపై ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో పురోగతిని సమీక్షించారు. 1.గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, 2.గ్రామ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ఇంటింటి సర్వే, 3. బ్యాలెట్ పెట్టెల స్థితి మరియు వాటి కార్యాచరణ స్థితి, 4. పోలింగ్ కేంద్రాల డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం,5.అత్యంత సున్నితమైన, సున్నితమైన మరియు సాధారణ పోలింగ్ కేంద్రాలను పునఃపరిశీలన చేయడం.6. ఇప్పటివరకు పేలవమైన పనితీరు కనబరిచిన చోట బృందాలను పెంచాలని సూచనలు ఇచ్చారు.

## పేకాట క్లబ్బును మూసివేయాలని డీఎస్పీకి వినతిపత్రం అందజేసిన డాక్టర్ గజ్జల



**సత్తెనపల్లి.ఆగస్టు 19,రాజధాని వాయిస్:** పట్టణంలో రాజకీయ అండతో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారని, గతంలో పోలీసులు రైడ్ చేసి కొంత నగదును, వాహనాలను సీజ్ చేయటం జరిగినదని,అయినా అధికార అండతో పేకాట క్లబ్ ను యదేచ్ఛగా నిర్వహిస్తున్నారని,దీనివల్ల ఎన్నో కుటుంబాలు బలవుతున్నాయని, క్లబ్ ను వెంటనే మూసివేసి నిర్వహకులపై తగిన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పార్టీ కార్యాలయం నుండి డిఎస్పి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందిచారు.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ పరిశీలకులు చిట్టా విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకం

**జనసేన జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యుడు దూదేకుల.సలీమ్**



**పిడుగురాళ్ల.ఆగస్టు 19,రాజధాని వాయిస్:** రాష్ట్ర ప్రభు త్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై పల్నాడు జిల్లా జనసేన పార్టీ పొగ్రామ్ కమిటీ సభ్యుడు దూదేకుల సలీం హర్షం వ్యక్తం చేశారు.బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచే ఈ నిర్ణయం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. బీసీలకు సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీ యమన్నారు. గతంలో నందమూరి తారక రామారావు సిఎం గా ఉన్నప్పుడు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లను అమల్లోకి తీసుకువ చ్చారని, నాడు ఎన్టీఆర్ బీసీలకు రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేస్తే, నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరో అడుగు ముందుకు వేసి బీసీల రిజర్వేషన్ కోటాను 34 శాతానికి పెంచడం సంతోషకర మన్నారు.స్థానిక సంస్థల్లో బీసీలకు అధిక ప్రాతినిధ్యం లభించడం ద్వారా గ్రామస్థాయి నుంచి రాజకీయంగా బీసీలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని,ఈ సందర్భం గా కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియచేశారు.

## మంత్రి లోకేష్ ప్రవేశపెట్టిన నాలుగు కీలక బిల్లులకు శాసనసభ ఆమోదం

**అమరావతి.ఆగస్టు 19 రాజధాని వాయిస్** :రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో బుధవారం నాలుగు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. వాటన్నింటినీ సభ హర్షధ్వానాల నడుమ ఏకగ్రీవంగా ఆమోదించింది. ది ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరీ కమిషన్ అమెండ్ మెంట్ బిల్లు -- 2026, ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రైవేట్ స్కిల్ యూనివర్సిటీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ బిల్-2026లకు శాసనసభ పచ్చజెండా ఊపింది.

# గ్రామాల్లో పోలీసుల పల్లె నిద్ర

**- ఎస్పీ మహేశ్వర రెడ్డి పర్యవేక్షణ - ప్రజల సమస్యలపై ప్రత్యక్ష అవగాహన**
**- ఎన్నికల శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి**





**శ్రీకాకుళం, రాజధాని వాయిస్ : :** గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువ కావడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం లక్ష్యంగా శ్రీకాకుళం జిల్లా పోలీసులు "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల్లో రాత్రి బస చేస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. మంగళవారం రాత్రి గార, పొందూరు, టెక్కలి, ఎచ్చెర్ల, ఇచ్చాపురం సహా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని స్థానిక పరిస్థితులను పరిశీలించిన అధికారులు ప్రజల భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై అభిప్రాయాలు సేకరించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు హామీ ఇచ్చారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక ప్రాంతాలు, వ్యక్తులపై ముందస్తు పర్యవేక్షణ చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు. మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల వినియోగం, బాలల రక్షణ వంటి అంశాలపై గ్రామస్థులకు వివరించారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అక్రమ మద్యం, గంజాయి, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, సత్వర పరిష్కారం చూపడం, రానున్న ఎన్నికల్లో శాంతిభద్రతలను పరిరక్షించడం "పల్లె నిద్ర" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామస్థులు కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన వ్యక్తం చేశారు.

# వాహనదారులకు అప్రమత్తత కార్యక్రమం



**రాజధాని వాయిస్ బాపట్ల :** రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు వాహనదారుల్లో అప్రమత్తత పెంచే లక్ష్యంతో బాపట్ల జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు, సిబ్బంది కలిసి "ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని చేపట్టారు. దీర్ఘదూర ప్రయాణాలు చేసే వాహనదారుల్లో అలసటను తగ్గించి సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. ప్రయాణ సమయంలో అలసట, నిద్రమత్తు కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో పోలీసులు ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య కూడళ్లు, జాతీయ రహదారుల వెంట వాహనదారులను ఆపి వారికి ముఖం కడుక్కునేందుకు సదుపాయాలు కల్పించారు. కొంతసేపు విశ్రాంతి తీసుకుని అనంతరం ప్రయాణం కొనసాగించాలని సూచించారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ వాహనదారులకు పోలీసులు పలు సూచనలు చేశారు. ఎక్కువసేపు నిరంతరంగా వాహనం నడపకుండా మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలని, అలసటగా అనిపిస్తే వెంటనే వాహనాన్ని పక్కన నిలిపి కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. వాహనదారుల ప్రాణ భద్రతే తమ ప్రధాన లక్ష్యమని పోలీసులు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేవలం నిబంధనల అమలు మాత్రమే కాకుండా అవగాహన కార్యక్రమాలు కూడా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వాహనదారుల్లో అప్రమత్తత పెరిగి ప్రమాదాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న వాహనదారులు పోలీసుల చొరవను అభినందించారు. ప్రయాణ మధ్యలో విశ్రాంతి తీసుకోవడం, అలసటను తగ్గించుకోవడం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా గుర్తుకు వచ్చిందని పేర్కొన్నారు. రహదారి భద్రతపై ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. భవిష్యత్తులో కూడా రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ కోసం ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడతామని పోలీసులు తెలిపారు. ప్రజల సహకారంతో సురక్షిత రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

# భూత్పూర్ సబ్‌స్టేషన్‌పై సీఎండీ సమీక్ష

**రాజధాని వాయిస్ మహబూబ్‌నగర్, ఆగస్టు 19 :** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన విద్యుత్ సరఫరా పరిస్థితులు, వినియోగదారులకు అందుతున్న సేవలు, సాంకేతిక నిర్వహణ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థ పనితీరును నేరుగా పరిశీలిస్తూ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్‌పై ప్రస్తుతం ఉన్న విద్యుత్ లోడ్, గరిష్ట డిమాండ్ సమయాల్లో తీసుకుంటున్న చర్యలు, విద్యుత్ సరఫరా సామర్థ్యం, భవిష్యత్ అవసరాలను ఎదుర్కొనే సన్నద్ధత వంటి అంశాలపై సీఎండీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోందో, ఆయా ప్రాంతాల్లో తక్కువ వోల్టేజీ, తరచూ విద్యుత్ అంతరాయాలు లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఉన్నాయా అనే విషయాలపై అధికారులు సీఎండీకి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాలు, గృహ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లు, ఫీడర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని జితేష్ వి. పాటిల్ అధికారులకు సూచించారు. ప్రతి ఫీడర్ పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ లోపాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని చెప్పారు. నిర్వహణ పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయడం ద్వారా విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచవచ్చని అభిప్రాయపడ్డారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ, సురక్షిత విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని సీఎండీ స్పష్టం చేశారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్నందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ సరఫరా పరిస్థితులు, లోడ్ వివరాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక సమస్యలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులు సీఎండీకి సమగ్ర నివేదిక అందించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలపై కూడా చర్చించారు. ఈ తనిఖీలో టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ భీమనాయక్, డివిజనల్ ఇంజనీర్ చంద్రమౌళి, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధికి మరిన్ని చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 19 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మౌలిక వసతుల పరంగా ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతర కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. బుధవారం 131వ డివిజన్ పరిధిలోని సంజీవయ్యనగర్ ప్రాంతంలో ఆయన పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిపై స్థానికులతో చర్చించారు. పాదయాత్ర అనంతరం దాదాపు రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రాంతీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానికులకు గణనీయమైన ఊరట లభిస్తుందని పేర్కొన్నారు.

## వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపిన శనగపూల వెంకయ్య మిత్ర బృందం



**రాజుపాలెం.ఆగస్టు 19, రాజధాని వాయిస్:** సీనియర్ దళిత నాయకుడు, తెలుగు దేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను పార్లమెంట్ ఎగువ సభ అయిన రాజ్యసభకు ఎంపిక చేసిన సందర్భంగా వర్ల రామయ్యను కలిసి సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు శనగ పూల వెంకయ్య శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, టిడిపి జాతీయ అధ్యక్షుడు మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ,రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, మంచి ప్రభుత్వంలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ దళితులు,మహిళలు, బీసీ వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రాజ్యసభకు ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన వారిని ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.దళితులకు బహుజనులకు ,మైనార్టీలకు,ఇతర వర్గాల వారికి కూటమి ప్రభుత్వంలోని సామాజిక న్యాయం జరుగుతుందని అనడానికి వర్ల రామయ్యను రాజ్యసభకు ఎంపిక చేయడమే ఒక నిదర్శనం అన్నారు. సత్తెనపల్లి నియోజవర్గములో టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చెందుతుందని, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక విమర్శించడాన్ని తప్పుబట్టారు. టిడిపి అంటే అభివృద్ధి అని, అభివృద్ధి అంటే కన్నా అన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,నాయకులు పాల్గొన్నారు.

## కారంపూడి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎం వాసు



**కారంపూడి.ఆగస్టు 19రాజదాని వాయిస్** :మండలంలోని మహిళ ఆత్మహత్యాయత్నం ఘటనపై ఎస్సై వాసుని సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు అనంతరం విచారణలో కారంపూడి ఎస్సై వాసుపై విధించిన సస్పెన్షన్‌ను ఉన్నతాధికారులు ఎత్తివేశారు. మిర్చి వ్యాపారి డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు పోలీసులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. అయితే రైతులు వెళ్లి మిర్చి వ్యాపారిని డబ్బులు అడిగారు. డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చిన రైతులు ఈ కేసు విషయంలో మిర్చి వ్యాపారిని స్టేషన్‌కు పిలిపించిన నేపథ్యంలో తనకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ అతని భార్య పురుగుమందు తాగిన ఘటన అప్పట్లో కలకలం రేపింది. దీనిపై అధికారులు విచారణలో నిజ నిజాలు తెలుసుకొని తాజాగా మంగళవారం కారంపూడి పోలీస్ స్టేషన్ కి ఎస్సై వాసును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు కారంపూడి మండలంలో ఎస్ఐ వాసు పై చేసిన తప్పుడు ఆరోపణలన్నీ పోలీసు అధికారులు పరిశీలించారు. నిజమైన మిర్చి రైతులకు న్యాయం చేస్తామని పోలీస్ అధికారులు తెలిపారు. కారంపూడి స్టేషన్ కు ఎస్సై వాసును నియమించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సై వాసు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు చేపడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

## వర్ల రామయ్యకు మంత్రి లోకేష్ శుభాకాంక్షలు



**అమరావతి.ఆగస్టు 19 రాజధాని వాయిస్ :** గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా నూతనంగా ఎన్నికైన టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్యకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. మండలిలో ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన అనంతరం మంత్రి నారా లోకేష్ ను అసెంబ్లీలోని ఆయన ఛాంబర్ లో కలిశారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పట్ల మంత్రి లోకేష్ కు వర్ల రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ విజయాలు, వాయిస్ మండలిలో మరింత బలంగా వినపడేలా చూడాలని మంత్రి లోకేష్ కోరారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com